

సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

# కాంగ్రెస్ పని ఖతం..

- బీఆర్ఎస్ హయాంలో దరఖాస్తులు లేకుండా పథకాల అమలు చేశాం
- పూటకో మాట మారుస్తున్న కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెబుతారు
- స్థానిక ఎన్నికల్లో వంద శాతం గెలుస్తున్నాం
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

తొర్రూరు, ఫిబ్రవరి 8 : దేశంలో కాంగ్రెస్ పని ఖతమైందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై విమర్శలు చేశారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. తొర్రూరులోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడుతూ.. మొన్న మహారాష్ట్రలో, ఇవాళ ఢిల్లీలో కాంగ్రెస్‌ను ప్రజలు పట్టించుకోలేదని, ఇప్పుడు తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ కాంగ్రెస్‌కు ప్రజలు గుణపాఠం చెబుతారని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తున్నదని మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో దరఖాస్తులు లేకుండానే పథకాలను అమలు చేశామని, కానీ, ఇప్పుడు ప్రతి పథకానికి మీ సేవ దరఖాస్తుల పేరిట ప్రజలను గందరగోళంలో పడేస్తున్నారని అన్నారు. రేషన్ కార్డుల విషయంలో కూడా ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం తప్పని, పేదలకు న్యాయం చేసే సంకల్పం లేకుండా, ప్రభుత్వ నిధులకు కోతలు పెట్టడమే కాంగ్రెస్ లక్ష్యంగా పెట్టుకున్నదన్నారు. 14 నెలల పాలనలో కాంగ్రెస్ చేసిందేమీ లేదన్నారు. ప్రజాపాలన, గ్రామసభల పేరిట హడావుడి చేసి చివరికి మళ్లీ మీ సేవ దరఖాస్తుల పేరుతో కాలం వెళ్లదీయాలని చూస్తున్నారని అన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సీఎం రేవంత్ రెడ్డి బ్రోకర్‌గా వ్యవహరిస్తూ డబ్బులు సంపాదించడంలో నంబర్ వన్ స్థానంలో ఉన్నారని విమర్శించారు. సీఎం అయిన తర్వాత కూడా అదే తంతు కొనసాగిస్తున్నారని అన్నారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ప్రజలకు ఎన్నో వాగ్దానాలు చేసిందని, ఇప్పటివరకు ఒక్క హామీనీ పూర్తిగా అమలు చేయలేదని ఎర్రబెల్లి ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల్లోనే ప్రజలు కాంగ్రెస్‌ను తిరస్కరించేందుకు సిద్ధంగా ఉన్నారని, ఇది వారికి బుద్ధి చెప్పే సమయమని పేర్కొన్నారు. సమావేశంలో మండల అధ్యక్షుడు పసుమర్తి సీతారాములు, బీఆర్ఎస్ సమన్వయ కమిటీ సభ్యుడు పొనుగంటి సోమేశ్వరరావు, మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, మాజీ ఎంపీపీ తూర్పటి అంజయ్య పాల్గొన్నారు.

# అధైర్యపడొద్దు మేమున్నాం..

- అమెరికాలో చదివే మన విద్యార్థులతో జూమ్ మీటింగ్
- కేటీఆర్‌తో కలిసి పాల్గొన్న మండలి విప్ సత్యవతి రాథోడ్
- మీ సమస్యలపై బీఆర్ఎస్ పోరాడుతుందని భరోసా



అమెరికాలోని విద్యార్థులతో జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సత్యవతి రాథోడ్

కురవి, ఫిబ్రవరి 8 : అమెరికాలో చదువుకుంటున్న తెలంగాణ ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు మేమున్నామని భరోసా ఇవ్వడంతో పాటు అక్కడ వారు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్ఎస్ పోరాడుతుందని ఎమ్మెల్సీ, శాసనమండలిలో బీఆర్ఎస్ విప్ సత్యవతిరాథోడ్ స్పష్టం చేశారు. అక్కడ విద్యార్థుల పడుతున్న గోసను శనివారం జూమ్ మీటింగ్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఎమ్మెల్సీ కవితతో కలిసి ఆమె పాల్గొని వారి ఇబ్బందులను స్వయంగా తెలుసుకున్నారు. విద్యార్థులూ అధైర్యపడొద్దు.. అండగా ఉంటామని చెప్పారు. అనంతరం కురవి మండలం అయ్యగారిపల్లిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు.

**రెండో దఫా స్కాలర్‌షిప్ ఇవ్వని కాంగ్రెస్**

కేసీఆర్ ప్రభుత్వం విదేశీ విద్యనభ్యసించే ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈడబ్ల్యూఎస్ విద్యార్థులకు అంబేద్కర్ స్కాలర్‌షిప్‌ను రూ.5లక్షల నుంచి రూ.20 లక్షలకు పెంచిందని గుర్తుచేశారు. అలాగే రూ.20లక్షల స్కాలర్ షిప్‌ను అందించిందని తెలిపారు. 127 మంది ఎస్టీ విద్యార్థులకు తొలి విడత రూ.10లక్షలు చెల్లించామని, రెండో దఫా చెల్లించే సమయానికి ఎన్నికలు వచ్చాయని ప్రస్తుతం ఆ విద్యార్థులు స్కాలర్‌షిప్ అందక అమెరికాలో అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విదేశీ విద్యకు రూ.25 లక్షలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ కనీసం రెండో దఫా నిధులు చెల్లించలేదన్నారు.

ఇప్పటివరకు కాంగ్రెస్ పార్టీ కమిటీ కూడా వేయలేదన్నారు. ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌ల గురించి బడ్జెట్‌లో పెట్టకపోవడం విచారకరమన్నారు. ట్రంప్ అమెరికా అధ్యక్షుడు అయ్యాక అక్కడ చదివే మన విద్యార్థుల పరిస్థితి మరింత దారుణంగా మారిందని, పార్ట్ టైం ఉద్యోగాలు చేసే అవకాశం కూడా లేక అనేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో స్కాలర్‌షిప్ రాక ఇబ్బందిపడుతున్న విద్యార్థులకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. రాష్ట్రంలోని అన్ని పార్టీల ఎస్టీ, ఎస్సీ ఎమ్మెల్యేలను కూడగట్టి అసెంబ్లీ సమావేశాల్లో చర్చిస్తామన్నారు. విద్యార్థులు భయపడొద్దని ధైర్యం చెప్పారు. సమావేశంలో జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, మాజీ మార్కెట్ చైర్‌పర్సన్ బజ్జూరి ఉమ, గ్రామ మాజీ సర్పంచ్ బజ్జూరి జోత్స్న, పార్టీ మండల అధ్యక్షుడు తోట లాలయ్య తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పక్కన మాజీ ఎమ్మెల్యే రాజయ్య

# హామీలు నెరవేర్చకపోతే ప్రజాగ్రహం తప్పదు

- అన్ని వర్గాలను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి
- ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్, ఫిబ్రవరి 8: దేశంలోని అన్ని రాష్ట్రాల్లో కాంగ్రెస్ పార్టీ ఖతమవుతున్నదని స్థానిక సంస్థల ఉమ్మడి వరంగల్ జిల్లా ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ, కర్ణాటక, మహారాష్ట్రలో కాంగ్రెస్ పార్టీ ప్రజల మద్దతును కోల్పోయిందని, ఎవరొచ్చి ప్రచారం చేసినా కాంగ్రెస్ పార్టీకి పరాభవం తప్పడం లేదన్నారు. రాహుల్‌గాంధీ బీజేపీకి బీ టీం అని, ఇతర పార్టీల ఓట్లను చీల్చి బీజేపీ విజయానికి పరోక్షంగా ఆ పార్టీ కృషి చేస్తున్నదన్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన 420 హామీలను అమలు చేయకుంటే ప్రజాగ్రహం తప్పదన్నారు. కుల గణన పేరుతో బీసీల మోసం చేసిన సీఎం, ఎస్సీ వర్గీకరణ విషయంలో నాన్చుడు ధోరణి తప్పా.., వర్గీకరణ చేసేది ఎప్పుడో స్పష్టం చెప్పడం లేదన్నారు. ఎస్సీ వర్గీకరణ అంటూ మాల, మాదిగలను రెచ్చగొడుతూ వారి మధ్య చిచ్చుపెడుతున్నాడని అన్నారు. వర్గీకరణ కోసం మంద కృష్ణ మాదిగ లక్ష డప్పులు, వేల గొంతుల పేరుతో పెద్ద కార్యక్రమం చేపడుతున్నాడని, దీనికి బీఆర్ఎస్, ఇతర పార్టీలు మద్దతు ఇస్తున్నాయనే ఉద్దేశంతోనే వర్గీకరణ చేస్తున్నట్లు ప్రకటించారని విమర్శించారు. సీఎం రేవంత్‌రెడ్డి కక్షపూరితంగానే కేసీఆర్ కుటుంబంపై అనేక అక్రమ కేసులు పెడుతున్నాడని, అందులో ఇప్పటి వరకు ఏ ఒక్క కేసు కూడా నిలువలేదన్నారు. రాష్ట్రంలో తుగ్లక్ పాలన నడుస్తున్నదని, ఎవరెన్ని కేసులు పెట్టినా భయపడరన్నారు.

**స్టేషన్‌ఘన్‌పూర్‌లో రాక్షస పాలన..**

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణాన్ని కోల్పోయారని, రాక్షస పాలన నడుస్తున్నదని పోచంపల్లి అన్నారు. ఇవే తన చివరి ఎన్నికలని కేసీఆర్‌ను వేడుకొని బీఆర్ఎస్‌తో గెలిచి, తన కూతురు కోసం అతడి అనుభవాన్ని, ఆత్మాభిమానాన్ని కాంగ్రెస్‌కు కడియం శ్రీహరి తాకట్టు పెట్టారన్నారు. బీఆర్ఎస్‌లో ఉన్నప్పుడు కాళేశ్వరం ప్రాజెక్టు గొప్పదని, వయసులో చిన్నవాడైన కేటీఆర్ విజన్ ఉన్న వ్యక్తి అని, అతడి కింద పనిచేయడం సంతోషంగా ఉందని చెప్పిన కడియం, నేడు కాంగ్రెస్ మెప్పు కోసం కేసీఆర్ కుటుంబాన్ని విమర్శిస్తున్నారని పేర్కొన్నారు. ఓటుకు నోటు కేసులో ఇరుక్కున్న వ్యక్తి వద్ద పనిచేసే వారిని ఏమంటారో కడియం చెప్పాలన్నారు. సోషల్ మీడియాలో వచ్చిన వార్తలకు స్పందించి వారిపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపించడం సరికాదన్నారు. మరికొద్ది రోజుల్లో స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలో ఉపఎన్నికలు వస్తాయని, బీఆర్ఎస్ నుంచి మాజీ ఎమ్మెల్యే రాజయ్యను లక్ష ఓట్ల మెజార్టీతో గెలిపించుకోవడానికి నియోజకవర్గ ప్రజలు, బీఆర్ఎస్ శ్రేణులు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

**మనోజ్‌రెడ్డిని విడిపించాలి**

**మాజీ ఎమ్మెల్యే రాజయ్య**

స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గ కో ఆర్డినేటర్ కేశిరెడ్డి మనోజ్‌రెడ్డి తన కేఎంఆర్ చానల్‌లో కడియానికి వ్యతిరేకంగా వార్తలు పెట్టినందుకు అతడిపై కక్షపూరితంగా కేసులు పెట్టించి, జైలుకు పంపించాడని మాజీ ఎమ్మెల్యే రాజయ్య విమర్శించారు. 14 నెలల పాలనలో కడియం ఇప్పటి వరకు ఏడుగురిపై అక్రమ కేసులు పెట్టించారన్నారు. మనోజ్‌రెడ్డిని జైలు నుంచి విడిపించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో దివ్యాంగుల కార్పొరేషన్ మాజీ చైర్మన్ వాసుదేవారెడ్డి, మండల అధ్యక్షుడు మాచర్ల గణేశ్ పాల్గొన్నారు.


నమస్తే తెలంగాణ

హనుమకొండ

8 | వరంగల్, ఆదివారం 9 ఫిబ్రవరి 2025 | HANUMAKONDA


**ఎన్నికల ముందు హామీ ఇచ్చి.. ఆశజూపి..** అధికారంలోకి వచ్చాక మొండిచేయి చూపిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వంపై బీసీలు భగ్గుమంటున్నారు. రాజ్యాంగ బద్ధంగా 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామన్న మాటలను తుంగలో తొక్కారని మండిపడుతున్నారు. కామారెడ్డి డిక్లరేషన్‌కు మంగళం పాడడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర సర్కారు ఇటీవల ప్రకటించిన కులగణన లెక్కలన్నీ తప్పుల తడకని దుయ్యబట్టారు. ఓసీల జనాభా పెరిగి.. బీసీలు ఎలా తగ్గుతారని ప్రశ్నిస్తున్నారు. వారికోసమే కాంగ్రెస్ ప్రభుత్వం బడుగులను బలిపెడుతున్నదని ఆరోపిస్తున్నారు. మళ్లీ పారదర్శకంగా సర్వే చేపట్టి.. కులాల వారీగా సమగ్ర లెక్కలు తేల్చాలని డిమాండ్ చేస్తున్నారు. ఆ తర్వాతే స్థానిక ఎన్నికలకు వెళ్లాలని సూచిస్తున్నారు. తమ ఆవేదనను, విన్నపాలను పట్టించుకోకుండా మోసం చేయాలని చూస్తే బీసీలంతా ఐక్యంగా ఉద్యమిస్తామని సీఎం రేవంత్‌రెడ్డిని హెచ్చరిస్తున్నారు. తమ బలమేంటో చూపి కాంగ్రెస్‌ను బొందపెడతామని ఖరాకండిగా చెప్తున్నారు. **- నమస్తే నెట్‌వర్క్, ఫిబ్రవరి 8**


## బీసీల సరైన లెక్క తేల్చాలి



కాజీపేట : రాష్ట్రంలో 2014లో అప్పటి ప్రభుత్వం బీసీల జనాభా 52 శాతం నుంచి 56 శాతం ఉన్నదని చెప్పింది. ప్రస్తుతం అధికారంలో ఉన్న కాంగ్రెస్ సర్కారు చేపట్టిన కులగణనలో 46 శాతం బీసీలున్నారని తేల్చడం సరికాదు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే సర్వేలో పాల్గొనని లక్షలాది మందిని గుర్తించి తిరిగి సర్వే చేయించి, అసలు బీసీల లెక్కను తేల్చాలి. భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు విద్య, ఉద్యోగం, ఉపాధి, ఆర్థిక, రాజకీయ తదితర రంగాల్లో వెనకబడి ఉన్న బీసీ, ఎంబీసీలను గతంలో పాలించిన టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. అభివృద్ధికి కృషి చేయలేదు. రాష్ట్ర సాధనలో భాగంగా ఉద్యమించి తెలంగాణను సాధించుకున్న తర్వాత బీసీ రిజర్వేషన్ సమస్యను పరిష్కరించాలని గత సీఎం కేసీఆర్‌ను కోరడంతో ఆయన సర్వే చేయించారు. కాంగ్రెస్ ప్రభుత్వం 10 శాతం ఉన్న ముస్లిం మైనార్టీలను కలిపి మొత్తంగా 56 శాతం బీసీలున్నట్లు ప్రకటించింది. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీల లెక్కలు తప్పు అని బీసీ సంఘాలు భావిస్తున్నాయి. తిరిగి సర్వే చేసిన తర్వాతనే స్థానిక ఎన్నికలకు వెళ్లాలి.

*– ప్రతాపగిరి విజయ్‌కుమార్, రాష్ట్ర అధ్యక్షుడు, తెలంగాణ బీసీ బహుజన సంక్షేమ సంఘం*

- ఓసీల కోసం బడుగులను బలిపెడుతున్న కాంగ్రెస్
- ప్రభుత్వం కులాల వారీగా సమగ్ర లెక్కలు చూపాలి
- ఎన్నికల హామీ మేరకు 42 శాతం రిజర్వేషన్ కల్పించాలి
- బీసీలను మోసం చేస్తే ఉద్యమిస్తాం
- సీఎం రేవంత్‌ను హెచ్చరిస్తున్న బీసీ సంఘాల నాయకులు



# లెక్క తేల్చాకే.. ఓట్లకు పోవాలె

**మళ్లీ బీసీ సర్వే చేపట్టాల్సిందే..**

## కులగణన అంతా బూటకం



హనుమకొండ : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన బీసీ కులగణన సర్వే అంతా బూటకం. తప్పుల తడకగా ఉంది. ప్రభుత్వం విడుదల చేసిన నివేదికను బీసీలందరు వ్యతిరేకిస్తున్నారు. కేసీఆర్ హయాంలో చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో బీసీల జనాభా 52 శాతం ఉంటే పదేళ్ల తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వం 46 శాతంగా చూపించి మోసం చేస్తున్నది. ఏడు శాతం ఉన్న అగ్రకుల జనాభాను మాత్రం15 శాతంగా చూపించి, బీసీలపై సర్కారు కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నది. బీసీలను రాజకీయంగా అణగదొక్కే కుట్రలో భాగంగా జనాభాను తక్కువ చేసి చూపిస్తున్నారు. ఓసీలు పెరిగినప్పుడు బీసీలు ఎలా తగ్గుతారు? దీనిపై రాష్ట్ర ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలి. ప్రస్తుత సర్వే ఫలితాలను పూర్తిగా సమీక్షించి, నిజమైన గణాంకాలను వెల్లడించాలి. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ తప్పకుండాఅమలు చేయాల్సిందే. అలాగే విద్య, ఉద్యోగ రంగాల్లో రిజర్వేషన్‌ను 52 శాతం పెంచాలి. 2014లో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి సీఎం కేసీఆర్ చేసిన సమగ్ర సర్వేనే నిజమైనది.

*– నాగుర్ల వెంకటేశ్వర్లు, రైతు రుణ విముక్తి కమిషన్ మాజీ చైర్మన్*

## 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలి



ఎల్కతుర్తి : బీసీల జనాభాకు అనుగుణంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లు ఇస్తామన్న హామీని కాంగ్రెస్ ప్రభుత్వం నిలబెట్టుకోవాలి. ఇటీవల కులగణన చేపట్టిన సర్కారు బీసీల జనాభాను తక్కువగా చూపించడం సరైందికాదు. సమాజంలో జనాభా పెరుగుతుందే తప్ప తగ్గదు. గతంలో చేసిన సర్వేలో 52 శాతం ఉంటే, ఇప్పుడు కేవలం 46.25 శాతమే బీసీలున్నారని నివేదిక ఇవ్వడం మోసం చేయడమే. అలాగే బీసీల్లో ఏ కులం వారు ఎంత శాతం ఉన్నారో చెప్పలేదు. కేవలం బీసీలకు న్యాయం చేస్తున్నామని చెప్పుకోవడమే తప్ప ఆచరణలో మాత్రం చూపడం లేదు. చాలా కుటుంబాలు సర్వేలో పాల్గొనలేదు. దీనివల్ల బీసీల జనాభా ఎంత శాతమో ఎలా లెక్కకడుతారు. వెంటనే రీ సర్వే చేసి పారదర్శకంగా బీసీల వాటాను తేల్చాలి. ప్రభుత్వం ఇచ్చిన హామీకి కట్టుబడి చట్టబద్ధంగా 42 శాతం రిజర్వేషన్లు బీసీలకు కల్పించాలి.

*– బచ్చు ఆనందం, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఎల్కతుర్తి*

## బీసీలకు తీరని అన్యాయం



బచ్చన్నపేట : రాష్ట్రంలో మెజార్టీగా ఉన్న బీసీలకు కాంగ్రెస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తున్నది. జనాభా దామాషా ప్రకారం మాకు రావాల్సిన వాటాను కుదించే ప్రయత్నం చేయడం తగదు. పది శాతం ఉన్న ముస్లింలను బీసీల్లో కలపడం ఎంత వరకు సమంజసం. దీనిని బట్టే కాంగ్రెస్‌కు బీసీలపై ఎంత ప్రేమ ఉందో తెలుస్తున్నది. బీసీ రిజర్వేషన్లపై స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి. లేకుంటే మరో పోరాటం తప్పదు. ఈ సారి ఎన్నికల్లో బీసీ వ్యతిరేక పార్టీలకు గుణపాఠం చెప్పక తప్పదు.

*– ముశిని రాజు, గౌడ సంఘం జిల్లా నాయకుడు, బచ్చన్నపేట*

## సమగ్ర సమాచారమేది?



పరకాల: కుల గణనలో సమగ్ర సమాచారం లేకుండా అసంపూర్తిగా ఉంది. పదేళ్ల క్రితం కంటే బీసీల జనాభా తగ్గడం హాస్యాస్పదం. అన్ని కులాల జనాభా పెరిగితే బీసీల జనాభా ఏ విధంగా తగ్గుతదో రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్ రెడ్డి చెప్పాలి. బీసీలను అణగదొక్కి ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లను కాపాడుకునేందుకే రెడ్డిల ప్రభుత్వం బీసీలపై కుట్రలు చేస్తున్నది. బీసీల్లో ఏ కులం ఎంత జనాభా ఉందో చెప్పడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కులగణన చేయని కుటుంబాలు గ్రామాల్లో చాలానే ఉన్నాయి. ఇంకా పట్టణాలు.. నగరాల్లో ఎన్ని ఉంటాయో అర్థం చేసుకోవచ్చు. బీసీ డిక్లరేషన్ మేరకు సమగ్ర కులగణన వివరాలు వెల్లడించి కాంగ్రెస్ ప్రభుత్వం చిత్తశుద్ధిని కాపాడుకోవాలి. లేదంటే బీసీలు చూస్తూ ఊరుకోరు.

*– వరికెల కిషన్ రావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర నాయకుడు*

## మా బలమేంటో చూపుతాం



కురవి: రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు అమలు చేస్తూ తీర్మానం చేసి అసెంబ్లీలో బిల్లు పాస్ చేయకుంటే మా బలమేంటో చూపుతాం. సార్వత్రిక ఎన్నికల్లో బీసీలంతా ఏకమై ప్రతి నియోజక వర్గంలో రెండు వేల మంది నామినేషన్లు వేసి సంచలనం సృష్టిస్తాం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం కులగణన పేరిట బీసీల శాతాన్ని తగ్గించి, వారిని రాజకీయంగా సమాధి చేసే ప్రయత్నం చేస్తున్నది. కులాలకతీతంగా ఏకమై 42 శాతం రిజర్వేషన్లు సాధించుకుంటాం. బీసీలను మోసం చేయాలని చూసే ఏ పార్టీనైనా ఓటు ద్వారా సమాధి చేస్తాం. బీసీలకు రాజ్యాధికారం వచ్చే దాక విశ్రమించేది లేదు. రాబోయే రోజుల్లో కార్యాచరణ ప్రకటిస్తాం.

*– బండారు వెంకటరమణ, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు, మహబూబాబాద్*

# డీటీసీ పుప్పాల శ్రీనివాస్ అరెస్ట్

- రిమాండ్‌కు తరలింపు
- రూ.4.04 కోట్ల ఆస్తులున్నట్లు తేల్చిన ఏసీబీ
- బహిరంగ మార్కెట్‌లో విలువ రూ. 50 కోట్లపైనే..



ఏసీబీ దాడుల్లో పట్టుబడిన బంగారు, వెండి ఆభరణాలు

సుబేదారి, ఫిబ్రవరి 8: ఆదాయానికి మించి ఆస్తులు కలిగి ఉన్నాడనే సమాచారంతో వరంగల్ డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) పుప్పాల శ్రీనివాస్ నివాసంతోపాటు మరో నాలుగు ప్రాంతాల్లో ఏసీబీ అధికారులు నిర్వహించిన దాడులు శుక్రవారం అర్ధరాత్రి వరకు కొనసాగాయి. డీటీసీ మొత్తం రూ.4,04,78,767 విలువైన ఆస్తులు కలిగి ఉన్నట్లు వారు తేల్చారు. మూడు గృహాల విలువ రూ. 2,79,32,740,16 ఓపెన్ ప్లాట్లు రూ.13,57,500, 15.20 ఎకరాల వ్యవసాయ భూమి రూ.14,04,768, బ్యాంకు బ్యాలెన్స్ రూ. 5,85,409, గృహోపకరణాలు రూ. 22,85,700, 3 ఫోర్ వీలర్స్, ఒక బైక్ రూ. 43.80 లక్షలు, 1542.8 గ్రాముల గోల్డ్ రూ. 19,55,650, 400 గ్రాముల వెండి రూ. 28వేలు, 23 విదేశీ మద్యం బాటిళ్ల విలువ రూ. 5.29 లక్షలు ఉన్నట్లు అధికారులు పేర్కొన్నారు. కాగా, పలివేల్పులలోని డీటీసీ శ్రీనివాస్ ఇంట్లో సోదాలు పూర్తయిన తర్వాత శనివారం ఆయనను అరెస్ట్ చేసి హనుమకొండలోని ఏసీబీ కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించినట్లు వరంగల్ రేంజ్ ఏసీబీ డీఎస్పీ సాంబయ్య తెలిపారు.


# వరంగల్ డీటీవో సస్పెన్షన్

**ఎంవీఐ శోభన్‌బాబుకు పూర్తి అదనపు బాధ్యతలు**

కరీమాబాద్, ఫిబ్రవరి 8 : వరంగల్ రవాణాశాఖ అధికారి గంధం లక్ష్మిని ప్రభుత్వం సస్పెండ్ చేసింది. ఆమె స్థానంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)గా విధులు నిర్వర్తిస్తున్న శోభన్‌బాబుకు పూర్తి అదనపు భాధ్యతలను అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. విధుల్లో నిర్లక్ష్యం వహించినందుకు డీటీవో లక్ష్మిని ఇటీవల కలెక్టర్ సత్యశారద సరెండర్ చేసింది. దీంతో ప్రభుత్వం ఆమెను సస్పెండ్ చేస్తూ రాష్ట్ర కార్యాలయంలో రిపోర్టు చేయాలని ఆదేశించింది.

# రేషన్‌కార్డు దరఖాస్తులకు బ్రేక్

- రాత్రి ఉత్తర్వులిచ్చి.. తెల్లారేసరికి వెనక్కి..
- మీ సేవ కేంద్రాల వద్దకు పరుగులు తీసిన జనం
- ప్రభుత్వ నిర్ణయంతో నిరాశతో వెనుదిరిగిన వైనం




మీసేవ కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన బోర్డు

మహబూబాబాద్, ఫిబ్రవరి 8 (నమస్తే తెలంగాణ)/ నర్సింహులపేట : రేషన్‌కార్డు దరఖాస్తుల ప్రక్రియకు ప్రభుత్వం మంగళం పలికింది. ఇన్నేళ్లుగా ఎదురు చూస్తున్న ప్రజలకు నిరాశే మిగిలిం ది. కొత్త రేషన్‌కార్డులు, పాతవాటిల్లో మార్పులు, చేర్పులు చేసుకునేందుకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం రాత్రి ఉత్తర్వులు ఇచ్చింది. జీవో కాపీతో వివిధ గ్రూపుల్లో మేసేజ్‌లు పెట్టారు. దీంతో ప్రజ లు ఎంతో ఆశతో శనివారం ఉదయం మీ-సేవ కేంద్రాలకు పరుగులు తీశారు. కానీ సర్కారు సైట్ ను నిలిపివేయడంతో ఓపెన్ కాలేదు. దీంతో ప్రజ లు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ప్రభుత్వ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రేషన్ కార్డుల కోసం ఇప్పటికే మూడు, నాలుగు మార్లు దరఖాస్తు చేసుకున్నామని, ప్రజాపాలన, కులగణన, గ్రామ, వార్డు సభల్లో సైతం పలుమార్లు అప్లికేషన్లు ఇచ్చామని, మళ్లీ మీ-సేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని చెప్పడం సరికాదని అసహనం వ్యక్తం చేస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం దరఖాస్తులతోనే కాలయాపన చేస్తోందని మండిపడుతున్నారు. ప్రజాపాలన కార్యక్రమంలో ఇచ్చిన దరఖాస్తులను పరిశీలించి, వాటి ఆధారంగానే కొత్త రేషన్‌కార్డులు మంజూరు చేయాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలిసిందని, అందుకే డూప్లికేట్ ప్రక్రియను నివారించేందుకు మీ-సేవ కేంద్రాల ద్వారా దరఖాస్తుల స్వీకరణ నిలిపివేసిందని మహబూబాబాద్‌లోని ఒక మీసేవా కేంద్రంలో పలువురు పేర్కొంటున్నారు. ప్రభుత్వం నుంచి తదుపరి సమాచారం అందిన తర్వాత తెలియజేస్తామ ని బోర్డులు ఏర్పాటు చేశారు. శనివారం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మీ-సేవ కేంద్రాల నిర్వాహకులు, దరఖాస్తు చేసుకునేందుకు వచ్చిన జనం మ ధ్య గొడవలు జరిగాయి. ఇప్పటికైనా ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## గొడవలు జరుగుతున్నాయి

ప్రభుత్వం ఇచ్చిన సమాచారంతో శనివారం ఉదయం నుంచి మీ-సేవ కేంద్రాలకు ప్రజలు పోటెత్తారు. వారికి సమాధానం చెప్పలేకపోతున్నాం. 'ప్రభుత్వం మీ-సేవలో దరఖాస్తు చేసుకోమని చెబితే మీరెందుకు తీసుకోవడం లేదు' అని ప్రజలు మమ్ముల్ని నిలదీస్తున్నారు. దీంతో నిర్వాహకులు, ప్రజల మధ్య గొడవలు జరుగుతున్నాయి. ప్రభుత్వం నుంచి తదుపరి సమాచారం వచ్చే వరకూ రేషన్‌కార్డు దరఖాస్తుల కోసం రావద్దు. సమాచారం వస్తే ప్రజలకు మేమే చేరవేస్తాం.

*– రావిపాటి దేవేందర్‌రావు, మీ-సేవ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు*